


# 'కన్నీళ్ళకో కథ ఉంటుంది!'

లక్ష్మీభారతి రెడ్డి

తిరుపతి ఎడిషన్ పరిధిలోని బుచ్చినాయుని కండ్రిగలో న్యూస్ కంట్రిబ్యూటర్‌గా పనిచేస్తున్న నన్ను, కడప ఎడిషన్ పులివెందులకు స్టాఫ్ కం ఆన్‌లైన్ రిపోర్టర్‌గా ప్రమోషన్ ఇచ్చి ట్రాన్స్‌ఫర్ చేశారు పత్రికా యాజమాన్యం వారు.

ముందుగా పులివెందుల వెళ్ళి డ్యూటీలో చేరి, ఆపై వారంలోపే ఓ మంచి ఇల్లు చూసుకుని ఫ్యామ్లీని కూడా తీసుకెళ్ళాను.

బస్సు లారీ ఢీ, ప్రాణం తీసిన ట్రాక్టర్, పట్టపగలు దోపిడీ ఇలా సో... సో... న్యూస్ లయితే ఇచ్చాను. కానీ ప్రాంప్ట్‌గా ఓ సంచలన వార్తను ఇవ్వలేకపోయాను ఆ నెలలో.

ఆరోజు ఉదయం ఏడుగంటలు !

ఫోను రింగవుతుండటంతో ఎత్తాను !

"హలో !"

"హలో.... ఎవరూ ?"

"లోకనాదమండి !"

"ఆ... నీ కొరకే ఫోన్ చేశానయ్యా ! బుచ్చినాయుడి కండ్రిగలో పనిచేసిన నిన్ను మాంచి తెగబొడిసే విలేఖరని రికమండేషన్ చేసి మరీ నా నెత్తిన తోశారయ్యా నిన్ను ?" అన్నట్టు నేనెవరో చెప్పలేదు కదూ ? కడప ఎడిషన్ మేనేజర్ సుబ్బయ్యను, అర్థమైందా ?

"సార్.... నమస్తే !"

"మస్కాలకో, నమస్కారాలకో పడేవాడ్ని కాదయ్యా నేను, స్టామినా చూపగలిగిన వారికి ఆత్మీయుడ్ని అర్థమైందా ?

"తెలుసు సార్, ఓ నాలుగైదు రోజులు టైం ఇవ్వండి, మంచిరిపోర్ట్ ఒకటి పంపుతాను!"

"అంటే ఓ రిపోర్ట్ పంపి, శనక్కాయలు తిని చేతులు దులిపేసుకుందామనుకుంటున్నారా?

"అబ్బే అలాంటిదేంలేదు సార్ !"

"సరే... ఓ నాలుగైదు రోజులు చూస్తా మీ నుండి ఏ రిపోర్టూ రాలేదనుకోండి మళ్ళీ డిమోట్ చేసి, మీ బుచ్చినాయుని కండ్రిగలో పడేస్తాను అర్థమైందా ?"

"సరే సార్ మీ ఇష్టం !"

వారు ఫోన్ పెట్టేయడంతో నేనూ ఆ పనే చేశాను. ఇంకేం చెయ్యలేక !

మేనేజర్‌గారికి నాలుగైదు రోజులని చెప్పానే కానీ అంత గుడ్ రిపోర్ట్ ఎలా ఇవ్వాలో నా ఆలోచనలకు అర్థం కాలేదు.

ఇంతలో టి.వి. ఆన్ చేశారు ఇంట్లో ఎవరో...?

"కట్టండ్రహో !" అని కేకేశాను, టి.వి. ఆగిపోయింది.

బస్టాండ్లోని సిమెంటు బల్లపై కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాను.

ఇంతలో దూరంగా ఓ నడివయస్కుడు చేతి కర్రల సహాయంతో కుంటుకుంటూ నడిచి వస్తున్నాడు.

అటుగా చూసాను !

అతనికి రెండు కాళ్ళు లేవు !

అతను నా సమీపంలోని కొస్తున్నాడు, ఉన్న రెండు చేతుల్లో ఓ చేతికి మూడు వేళ్ళే ఉన్నాయి. మెడలో ఓ టేగ్ తగిలించబడి ఉంది.

దగ్గరగా వచ్చిన అతన్ని ఆపాను.

"సార్ ధర్మం చెయ్యండి !" అతను అభ్యర్థిస్తున్నాడు.

జేబులోని అయిదు రూపాయలు తీసి అతని బొచ్చెలో వేసి, మెడలో వేలాడుతున్న ట్యాగ్‌ను చదవసాగాను.

"నడుస్తున్న ఫ్యాక్షన్ శవం... ధర్మం బాబూ !" అని రాసుంది అందులో.

"ఇదేంటయ్యా అలా రాసుకున్నావు?" ప్రశ్నించానతన్ని.

# నాయిక

మీరు చీపురులా మూల వుంచాలనుకుంటారు
నేను దుమ్మూ ధూళీ విదిల్చి చైతన్యమై మెరుస్తాను
చెప్పులా కాళ్ళకింద వుంచాలనుకుంటారు
ముళ్ళూ రాళ్ళూ గుచ్చుకోకుండా గమ్యం చేరుస్తాను
నేలమీద శబ్దం రాకుండా నెమ్మదిగా నడవాలంటారు
ఆకాశంలో శబ్దం చేస్తూ సముద్రాలు దాటతాను
నోరుతెరిచి మాట్లాడకూడదంటారు
గళం విప్పకుండా కనుసైగతోనే నినాదమిస్తాను
సన్నగా చిన్నగా నవ్వాలంటారు
మీ మనసుపొరల్లో వికటాట్టహాసం చేసి వణుకు పుట్టిస్తాను
తలదించుకొని కళ్ళు మూసుకొని వుండాలంటారు
కళ్ళనికాగడాలు చేసి తలెత్తి హిమాలయాల్ని చూస్తాను
పొగరుబోతని బిరుదులిస్తారు
మీ పులితోలు మేకల్ని చూసి జాలిపడతాను
పిరికిదని చెవులు కొరుక్కుంటారు
ఫిరంగిలా పేలి మీ చెవులు బద్దలు చేస్తాను
కొంగు నిండుగా కప్పుకొని వుండాలంటారు
పైటనే సందేశంగా ప్రపంచానికందిస్తాను
తిలక్ వెన్నెల్లో ఆడపిల్లను కాను
చలం శశిరేఖను కాను
గురజాడ కమలిని కాను
రంగనాయకమ్మ జానకిని కాను
ఓల్గా అరుణను కాను
అందర్నీ ఐక్యం చేసుకున్న నేటి నాయికను.

– జి. విజయలక్ష్మి

"ఇదే నిజం సారూ !"

అతన్ని తీసుకుని బస్టాండ్లో ఓ మూల కూర్చొని, రెండు కాఫీ ఆర్డర్ చేసాను వెండర్‌తో.

ఆ తరువాత ఇంటర్వ్యూ ప్రారంభించాను.

"నీ పేరు ?"

"రామిరెడ్డి !"

"ఎందుకు వచ్చింది ఈ దురవస్థ ?"

"ఫ్యాక్షనిజం పుణ్యమాని !"

"సరిగ్గా చెప్పు అర్థం కాలా ?"

"సరిగ్గా అర్థం కాని బతుకులే బాబూ మావి !"

"కొంచెం వివరంగా చెప్తావా ?"

"వినండి, రెక్కాడితే గానీ డొక్కాడని కూలి బతుకులు. అమ్మా నాన్నలకు నేనొక్కడినే సంతానం.

దున్నేందుకు పొలం లేదు !

మా జీవితాలు, జీవనాలూ అన్నీ బాంబులు తయారు చేసే పనిలోనే ఆగి ఆగి తిరిగి చూసి, బతుకు బాటలో భయం భయంగా బిక్కు బిక్కుమంటూ ప్రయాణం అవుతుంటాయి.

అది విధి గీసిన గీతో, మా పొట్ట గడవడం కోసం మాకు మేమే రాసుకున్న నుదుటి రాతో తెలియదు గాని 2005 ఎలక్షన్లో ప్రముఖ పార్టీకి బాంబులు తయారు చేసే పని దొరికింది.

మా పొరపాటో, ఆపై గ్రహపాటో తయారీలో తప్పిదం వల్ల ఇంట్లోనే బాంబులు పేలాయి. ఫలితంగా అమ్మానాన్నలు దుర్మరణం పాలయ్యారు.

బతికున్న శవంలా నేనొక్కడినే మిగిలాను ఇలా !

అప్పట్లో ఆదుకుంటామన్న పెద్దల పత్తా లేదు.

చివరకు ఇలా బిక్షగాడిలా... ఖాళీ కడపుకు గంజన్నంలా ఇలా సాగుతోంది !

"సరే రోజుకుఎంత సంపాదిస్తున్నావ్?"

"ఇదీ ఓ సంపాదనేనా బాబూ ?"

"దయగల వారు రూపాయో, అర్ధ రూపాయో వేస్తారు.....?"

"రోజంతా అడుక్కున్నా ముప్పై రూపాయలు దాటని సంపాదన !"

"మరి ఆ డబ్బులతో ఎలా జీవనం సాగిస్తున్నావు ?

అంతా అమ్మదయ ?

"అమ్మా...! నువ్వొక్కడివేనన్నావు... మధ్యలో ఈ అమ్మెవరు ?

"చూడాలని ఉందా ?"

"చూపిస్తా !"

"రండి !"

మా ప్రయాణం వదినిముషాలు సాగింది. ఆ పై ఓ ఇంటికి చేరుకున్నాం...

"ఫ్యాక్షనిజం" అని రాసి ఉంది ఆ ఇంటిముందున్న బోర్డులో...
లోనికి వెళ్ళాం

ఓ వరుసలో... కాళ్ళు లేని వారికి ! మరో వరుసలో... చేతుల్లేని వారికి !

వేరే వరుసలో 'అమ్మా !' అని రాసుంది వైవిధ్యంగా.

❀ ❀ ❀

"ఇదేంటయ్యా ఈ పేర్లు?" ఆశ్చర్యంగా అడిగా అతన్ని.

"బతుకుల్లో గతుకులు, బాకీ జీవితం పెట్టిన చెరపరాని, చెరిగిపోని పేర్లు !"

"ముందు... ఆ తర్వాత వరస పేర్లు చదవగానే వివరించకుండానే విషయం అర్థం చేసుకోగలరు ఎవరైనా?"

కానీ చివరి వరసలో "అమ్మ" అని రాసుంది దానర్థం ఏమిటి ?

"అదే సార్ అమ్మంటే... కురిపించే కరుణామృత ధారలంటే !

ఓ కాలో, చెయ్యో లేకపోతే కాస్త ఇబ్బందయినా ఎవరి పనులు వారు చేసుకోగలరు, కానీ కాళ్ళూ చేతులు రెండూ లేక, అటూ ఇటూ కదలలేక, సహాయం కోసం ఆర్తిగా, రెండు కళ్ళతో అభ్యర్థించే వారి కోసం !

"మరి వాళ్ళ పోషణ?" కాస్త బాధగానే అడిగాను.

"సంపాదించేందుకు మేమున్నాం, వారి ఆలనా పాలనా చూసుకునేందుకు అమ్మ వుంది. రోజంతా యాచకవృత్తిలో సంపాదించుకున్నదంతా అమ్మకిచ్చేస్తాం. మేం పాతికమంది వరకు ఉన్నాం. అందులో ఏ పనీ చేయలేనివారు ఎనిమిది మంది వరకూ ఉన్నారు.

వారి పనంతా అమ్మ చేస్తుంది. అక్కున చేర్చుకుని గుక్కెడు పాలిచ్చే వయసు కాకున్నా, ఆప్యాయం, అభిమానంతో పాటు కాస్త దయను, కారుణ్యాన్ని కలబోసి, మమతలతో తిరగబోసి వారికి తినిపిస్తుంది." అంటున్న గొంతులో ఫ్యాక్షనిజంపై అసహ్యం తాలూకూ నీడల జీర విన్పించింది.

"అమ్మొస్తోంది !" అంటూ కుర్చీనుండి కర్రల సాయంతో లేచాడతను గౌరవంగా.

"ఎవరా మహామనిషి" అనుకుంటూ నేనూ లేచి నిలబడ్డాను.

నల్ల కళ్ళద్దాలు, తెల్లచీర,జాకెట్ ధరించి మావైపుకు వస్తున్న ఓ నడివయస్కురాల్ని చూసాను.

"నమస్కారమమ్మా ! నేనుపత్రికా విలేఖర్ని" నన్ను నేను పరిచయం చేసుకున్నాను మర్యాదపూర్వకంగా

"నమస్తే కూర్చోండి !"

ఆ తర్వాత ఫ్యాక్షనిజం గురించి చాలాసేపు చర్చించాను.

"ఇంతకూ ఫ్యాక్షనిజం తాలూకు బాధితులకు సహకారం అందించాలని, వారి ఆలనా పాలనా చూసుకోవాలనే ఆలోచన మీకెలా వచ్చింది ?"

చివరగా ప్రశ్నించానామెను.

"ఎందుకంటారా?" అంటూ తన కళ్ళకున్న నల్ల కళ్ళద్దాలు తీసి చూపించిందామె. ఆపై ఆమె ఎడమచేతి వేళ్ళనూ చూపించింది.

అదిరిపడ్డాను నేను.

## చినుకు

చల్లగా
సన్నగా
సూటిగా
ఆకాశం నుడి
ప్రయాణం...
ఏ రాతిమీదనో
రాలిపోయి
బతుకు
ఆరిపోతుందని
దిగులు....
నదిలో పడి
కాలవగా మారి
రైతు పొలం చేరి
పంటగింజ కావాలని
శ్రామికుణ్ణి చేరాలని
మబ్బు నుండి తెగిపడ్డ
చినుకు చివరి కోరిక !

– డా॥ రావిరంగారావు.

ఆమెకో కన్ను లేదు. అది పూడ్చని గుంతలా ఉంది వికారంగా!

ఆమె ఎడమచేతి బొటనవేలు, చిటికెన వేలూ లేదు. మిగతా వేళ్ళన్నీ ఒక ఇంచ్ వరకు కట్ చేయబడి ఉన్నాయి.

"ఇదేంటమ్మా ?" శరీరం ఒకపక్క కంపిస్తుండగా అడిగాను

"ఫ్యాక్షనిజానికి సాక్షీభూతాలు నాయనా!"

కొన్నేళ్ళక్రితం నేనూ అందరిలా అవయవాలన్నీ సక్రమంగా ఉన్నదాన్నే ! ఆ సంవత్సరం మా ఊర్లో ఎన్నికలు జరిగాయి. ఇద్దరు పెద్దలు ఢీకొన్నారు. ఒకరు గెలవాలంటే.... మరొకరు ఓడాలి కదా ! అదే జరిగింది మా గ్రామంలో. అయితే ఓటమిపాలైన ఓ పెద్దోడు మా ఇళ్ళపైన దాడి చేసాడు.

"మీ వల్లే ఓడిపోయాం" అంటూ విజృంభించాడు.

దొరికినవాళ్ళను దొరికినట్టు చితక బాదాడు.

ఓపిక ఉన్నంతవరకు అందిన వాళ్ళ అవయవాలను నరికేసారు. ఆ క్రమంలో నా చేతి వేళ్ళను, కళ్ళను కత్తులతో గాయపరిచారు. దాని ఫలితమే ఇది" అంటూ గద్గద స్వరంతో వివరిస్తూ మళ్ళీ తనే

'అందుకే మేము ఏకమయ్యాం. ఆ ఊరొదిలేసి ఈ ఊరొచ్చాం.

"రెండుచేతులూ కలిస్తేనే కాని చప్పట్లు కావన్నట్లు, సమిష్టికృషితో ముందుకు సాగుతున్నాం.మా మార్గంలో ముందు ఎవరు నడుస్తున్నా రనేది ముఖ్యం కాదు. సక్రమంగా నడుస్తున్నారా లేదా అన్నదే ముఖ్యం"

నాకేం మాట్లాడాలో అర్థం కాలేదు. మాట్లాడగలిగీ, మాట్లాడలేక పోవడం అంటే ఏమిటో.... మాటలు వెతుక్కోవడం అంటే ఏంటో... చేష్టలుడగడం అంటే ఏవిటో మొదటిసారిగా అనుభవంలోకి వచ్చింది.

కళ్ళు చెమర్చాయి...వారి బాధలకు తోడుగా... భాష్పాంజలిగా!

## రంజని కుందుర్తి అవార్డు - 2007

రంజని కుందుర్తి అవార్డు-2007కు జాతీయ స్థాయిలో వచన కవితల పోటీకి కవితలను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలియజేశారు. 2007 సంవత్సరానికి మొత్తం అవార్డు సొమ్ము 5000/- రూ॥లు అత్యుత్తమ కవితకి 2000/-రూ॥లు, యోగ్యతాపత్రం. ఉత్తమ కవితకి 1000/-రూ॥లు, యోగ్యతాపత్రం, పది మంచి కవితలకు ఒక్కొక్క దానికి 200/-రూ॥లు, యోగ్యతాపత్రాలు

నిబంధనలు : ❖ కవిత సామాజిక స్పృహ కలిగి ఉండాలి. ❖ ఇంతవరకు ప్రచురణ, ప్రసారం కానివి, దేనికీ అనువాదం, అనుక(స)రణ కాని వచనకవితల్ని మాత్రమే పంపాలి. ❖ ఇందుకు సంబంధించిన హామీ పత్రాన్ని విధిగా జతపరచాలి. ❖ ఒకరు ఎన్ని కవితలైనా పంపవచ్చు. ❖ కవితని కాగితంపై ఒకవైపే రాయాలి. ❖ కవితలు పంపే కవరుపై రంజని కుందుర్తి అవార్డు -2007 అని పేర్కొనాలి. ❖ కవిత ఉన్న కాగితంపై పేరు, విలాసం ఏదీ రాయకూడదు. పూర్తిపేరు చిరునామా తదితర వివరాలు హామీపత్రంలో మాత్రమే పేర్కొనాలి. ❖ విజేతలకు ఫలితాలను నేరుగాను, పత్రికాముఖంగాను తెలియజేస్తాం. ❖ ఎంపికైన కవితలను ప్రచురించే హక్కు రంజనిదే. ❖ న్యాయనిర్ణేతలదే తుదినిర్ణయం.❖ కవితలకు సంబంధించి 'రంజని' తో ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు తావులేదు.కవితలను ప్రధానకార్యదర్శి, రంజని, తెలుగు సాహితీ సమితి, ఏ.జి. ఆఫీసు, హైదరాబాద్ - 500 004 అనే చిరునామాకు 30-9-2007 లోగా అందేలా పంపాలి.



నా గురుదేవులు
శ్రీ మురుగ భూషణమ్‌గారు
(నవశక్తి నిలయమ్, చెన్నై)

భారతదేశములో అతిపెద్ద జ్యోతిష్య గ్రంథాలయము గల ఏకైక సంస్థ

సాయి త్రిశక్తి నిలయమ్

(జ్యోతిష్య పరిశోధన - అభివృద్ధి కేంద్రం)


రాజర్షి - బ్రహ్మర్షి
దైవజ్ఞ కె. అచ్చిరెడ్డి B.sc.,
జ్యోతిష్య - రత్న - వాస్తు శాస్త్ర - పరిశోధకులు

ESTD : 1977

సరస్వతీ మహల్, MIG 132/1, H.B కాలనీ, ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ ఎదురుగా, భవానీపురం, విజయవాడ - 520 012 ఫోన్ : 2417796

జ్యోతిష్య వాస్తు - హస్త సాముద్రిక - రత్న శాస్త్రాలలో సుమారు 30 సం॥రాల అనుభవజ్ఞులు, దేవీఉపాసకులు, దైవజ్ఞ - రాజర్షి బ్రహ్మర్షి కె. అచ్చిరెడ్డి గారు పలువురు సినీ, రాజకీయ రంగ ప్రముఖుల భవిష్యత్ ఫలితాలను చెప్పి మన్ననలు పొందియున్నారు. జాతీయస్థాయిలో పలు అవార్డులు, సన్మానాలు - సత్కారాలు పొందియున్నారు.